
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం । 21 । జూన్ । 2025



సోమశిలలో 36.010 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 36.010 టీఎంసీలు ఉన్నాయి. 296 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా. డెల్టాకు 3.330. ఉత్తర, దక్షిణ కాలువలకు 1375 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,01,810
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,206
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,482
నవర (8 గ్రాములు)	రూ.75,856

గరిష్టం/కనిష్టం
39.0 /30.2

వాతావరణం

ఉష్ణోగ్రతలు జిల్లాలో శనివారం సాధారణంగానే ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శుక్రవారం 41 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

కాకాణితో ఆదాల ములాఖత్



జిల్లా సెంట్రల్ జైలు వద్ద మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు

వెంకటాచలం: కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులతో జిల్లా సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కొండ్రెడ్డి రంగారెడ్డి శుక్రవారం ములాఖత్ అయ్యారు. జిల్లాలో నెలకొన్న తాజా పరిస్థితులు, ఇతర అంశాలపై చర్చించారు. అధైర్య పడొద్దని, వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి వెంట వైఎస్సార్‌సీపీ నేతలు స్వర్ణా వెంకయ్య, సీహెచ్ హరిబాబుయాదవ్, పాశం శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యుడు మల్లు సుధాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు హంషీద్ అలీ, కొండేటి నరసింహారావు, షేక్ మొయిద్దీన్, ఆగాల శ్రీనివాసులురెడ్డి, ఖలీల్, జీవన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

నెల్లూరు (టౌన్): పాలిటెక్నిక్‌లోని ఆయా కోర్సుల్లో చేరేందుకు శనివారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు పాలిసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పాలిటెక్నిక్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ర్యాంకు కార్డు, ఫీజు చెల్లింపు రసీదు, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, ఆదాయ, కుల ధ్రువపత్రాలను తీసుకురావాలన్నారు.

తల్లికి వందనం వర్తింపజేయండి



మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న నేతలు

ఆత్మకూరు: ప్రభుత్వం చిన్నారుల చదువుల కోసం అందిస్తున్న తల్లికి వందనం పథకాన్ని మున్సిపల్ కార్మికులకు ఇవ్వకపోవడం దారుణమని, వారికి సైతం ఆ పథకం వర్తింపజేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మిక యూనియన్, సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ చిరుద్యోగులైన కార్మికులకు తల్లికి వందనం ఇవ్వకపోవడం ప్రభుత్వ అనాలోచిత నిర్ణయమన్నారు. ఈ కార్యక్రమంలో డేవిడ్ రాజు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టుల్లో 1998, 2008 డీఎస్సీ టీచర్లు

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సబ్జెక్ట్ టీచర్ల స్థానంలో 1998, 2008 డీఎస్సీలో ఎంపికై మినిమమ్ టైమ్ స్కేల్ కింద పని చేస్తున్న టీచర్లను నియమించాలని రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వారి సీనియారిటీ ప్రకారం ఆయా పాఠశాలల్లో నియమించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. పాఠశాలల్లో ఖాళీ పోస్టులు లేకపోతే క్లస్టర్‌ల్లో నియమించనున్నారు. 1998, 2008 డీఎస్సీల్లో ఎంపికై ఉద్యోగాలు పొందలేక నిరీక్షిస్తున్న అభ్యర్థులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మినిమమ్ టైమ్ స్కేల్‌తో టీచర్ పోస్టులు కల్పించిన విషయం విదితమే.

లాసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 124వ ర్యాంకు



నాగార్జున

దుత్తలూరు: ఏపీ లాసెట్ ఫలితాల్లో దుత్తలూరు మండలం ఏరుకొల్లుకు చెందిన రావిళ్ల నాగార్జున రాష్ట్రస్థాయిలో 124వ ర్యాంకు సాధించాడు. తిరుపతి ఎస్వీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి హెచ్‌ఈసీ గ్రూపులో 941 మార్కులు సాధించాడు. లాసెట్ ప్రవేశ పరీక్ష రాయగా ఉత్తమ ప్రతిభ కనబరచడంతో గ్రామస్తులు అభినందించారు. నాగార్జున మాట్లాడుతూ భవిష్యత్‌లో సివిల్స్ సాధించి పేదలకు సేవ చేయాలనేదే తన లక్ష్యమన్నారు.

కార్పొరేటు విద్య

- అధిక మొత్తంలో ఫీజులు
- పుస్తకాలు, యూనిఫాం, బస్సుకు అదనం
- ఆటల పేరుతో ప్రత్యేక వసూళ్లు
- అధిక వసూళ్లపై తల్లిదండ్రుల ఆగ్రహం
- మామూళ్లతో పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

మౌలిక వసతులు అంతంత మాత్రమే

జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు విద్యతో వ్యాపారం చేస్తున్నాయి. చదువు మాత్రమే చెప్పాల్సిన యాజమాన్యాలు.. పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం, షూలు, సాక్స్‌లు ఇలా అన్నింటితో వ్యాపారాలు చేస్తున్నాయి. ఇదే మెటీరియల్ బయట సగం ధరకే వస్తే.. వీరి దగ్గర రెండింతలు అధికంగా ఉంటాయి. తమ పాఠశాలలో చదివే ప్రతీ విద్యార్థి తమ వద్దనే మెటీరియల్ కొనాలనే కండీషన్ ఇక్కడ అమలు చేస్తున్నారు. బస్సులు పెట్టి అత్యధిక చార్జీలు వసూలు చేస్తుండడం ఇదొక రకం వ్యాపారం. ప్రతి పాఠశాలలో కచ్చితంగా క్రీడా మైదానాలు ఉండాల్సి ఉండగా, ఇందుకు కూడా ప్రత్యేకంగా ఫీజులు వసూలు చేయడం ఈ కార్పొరేట్లకే చెల్లుతోంది.



కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు - **824**

చదువుతున్న విద్యార్థులు - **1.70** లక్షల మంది

పుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీ - రూ.**15** వేలు (ఒక్కో విద్యార్థికి సగటున)

మొత్తం వ్యాపారం - రూ.**255** కోట్లు

12 శాతం జీఎస్టీ వసూలు అయితే.. - సుమారు రూ.**30** కోట్లు

నెల్లూరు (టౌన్): జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. తమ పిల్లలను కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో చదివించాలనుకునే తల్లిదండ్రులకు వారు నిర్ణయించే ఫీజుల దగ్గర నుంచి పుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీ, బస్సు చార్జీల పేర్లతో అందిన కాడికి దోచుకుంటున్నారు. పుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీ తదితరాలను పాఠశాలల్లోనే నేరుగా అత్యధిక ధరలకు విక్రయిస్తున్నారు. హైటెక్ పేర్లతో కనిపించే పాఠశాలల్లో కనీసం మౌలిక సదుపాయాలు ఉండడం లేదు. అపార్ట్‌మెంట్ భవనాల్లో ఇలాంటి పాఠశాలలను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను పాఠశాలల యాజమాన్యాలు అతిక్రమిస్తున్నా.. వారిచ్చే మామూళ్లు పుచ్చుకుంటూ జిల్లా విద్యాశాఖ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. ఆయా పాఠశాలలపై ఎవరైనా ఫిర్యాదు చేసినా పట్టించుకునే దిక్కులేదు.

రూ.20 వేల నుంచి రూ.1.75 లక్షల్లో ఫీజులు

జిల్లాలో విద్యాశాఖ లెక్కల ప్రకారం 824 కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 1.70 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఇవి కాకుండా ఎలాంటి అనుమతులు లేని మరో 200 పాఠశాలలు ఉన్నట్లు విద్యాశాఖాధికారులే చెబుతున్నారు. ఆయా పాఠశాలల్లో ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి వరకు విద్యాబోధనకు పాఠశాలను బట్టి రూ.20 వేల నుంచి రూ.1.75 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. మొత్తం ఫీజులో 50 శాతం స్కూల్లో చేరినప్పుడే చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన ఫీజు రెండు దఫాలుగా చెల్లించాలి. ఫీజుల స్ట్రక్చర్‌ను నోటీసు బోర్డులో ఉంచాలన్న నిబంధన ఉన్నా ఏ పాఠశాలలో అమలు కావడం లేదు. పేరెంట్స్ కమిటీలు ఎక్కడా ఉండవు. ఫీజులకు తగ్గ వసతులు ఏ పాఠశాలలో కనిపించవు. గాలి, వెలుతురు లేని గదుల్లో విద్యార్థులను ఉంచి బోధన చేస్తున్న పరిస్థితి ఉంది.



3వ తరగతికి పుస్తకాల లిస్టు

ప్రభుత్వానికి జీఎస్టీ కూడా రాని పరిస్థితి

ప్రభుత్వ నిబంధనల ప్రకారం కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఎస్‌సీఈఆర్టీ పుస్తకాలను మాత్రమే బోధించాల్సి ఉంది. ఆయా పాఠశాలల్లో ఎలాంటి పుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీలు విక్రయించకూడదు. అయితే కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల్లో యథేచ్ఛగా పుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీని విక్రయిస్తున్నారు. సొంతంగా పాఠశాల యాజమాన్యం మెటీరియల్‌ను ముద్రించి ఒక్కో విద్యార్థి నుంచి పుస్తకాల పేరుతో రూ.8 వేల నుంచి రూ.16 వేలు, ఒక్కో యూనిఫాం రూ.4 వేల నుంచి రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. దీంతో పాటు స్టేషనరీకి రూ.1,000 నుంచి రూ.1,500 వరకు వసూలు చేస్తున్నారు. ప్రతి విద్యార్థి ద్వారా సగటున రూ.15 వేలు వ్యాపారం చేస్తున్నారు. ఈ లెక్కన మొత్తం 1.70 లక్షల మంది విద్యార్థులకు ఏడాదికి రూ.255 కోట్ల వ్యాపారం జరుగుతోంది. ఇదే వ్యాపారం బయట వ్యాపారుల నుంచి జరిగితే.. కనీసం కేంద్ర మార్గదర్శకాల ప్రకారం 12 శాతం జీఎస్టీ రూపంలో సుమారు రూ.30 కోట్ల మేర ప్రభుత్వానికి చేరేది.

ఎడాపెడా ప్రత్యేక ఫీజులు

విద్యార్థుల నుంచి ట్రాన్స్‌పోర్ట్ పేరుతో మరో వ్యాపారానికి తెరతీశాయి. తక్కువ దూరానికి సైతం రూ.12 వేల నుంచి రూ.14 వేల వరకు వసూలు చేస్తున్నారు. విద్యార్థులకు క్రీడల్లో తర్ఫీదు, వాఠశాల వార్షికోత్సవ వేడుకల పేరుతో అదనంగా ఒక్కో విద్యార్థి నుంచి రూ.2 వేల నుంచి రూ.3 వేలు వసూలు చేస్తున్నారు. ఆయా పాఠశాలల యాజమాన్యాలు చేస్తున్న వసూళ్లకు తల్లిదండ్రులు ఆర్థికంగా కుంగిపోతున్నారు.

మామూళ్లతో విద్యాశాఖ ముఖం చాటేత

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూళ్లు, అనధికారికంగా పుస్తకాలు, యూనిఫాం విక్రయాలు చేస్తున్నా జిల్లా విద్యాశాఖ అధికారులకు ఏ మాత్రం పట్టడం లేదు. విద్యా సంవత్సరం ప్రారంభంలో పాఠశాలల గుర్తింపు, మౌలిక వసతులు, ఫీజుల వసూళ్లు, పుస్తకాలు, యూనిఫాం విక్రయాలపై ఎంఈఓ, డిప్యూటీ డీఈఓ, డీఈఓలు పాఠశాలలకు వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంటుంది. అయితే ఈ అధికారులు ఎప్పుడు క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీలు చేసిన సందర్భాలు ఉండడం లేదు. పాఠశాల గుర్తింపు సమయంలో కూడా గుమస్తా నుంచి జిల్లా విద్యాశాఖ అధికారి వరకు ముడుపులు ఇవ్వడంతో ఆ వైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఉంది.

పుస్తకాల పేరుతో అధికంగా వసూలు



విద్యాహక్కు చట్టం ప్రకారం పుస్తకాలు, యూనిఫాంను విక్రయించకూడదు. అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలలో 1వ తరగతికి పుస్తకాల కోసం రూ.16 వేలు వసూలు చేస్తున్నారు. అధికారులు ఎక్కడా తనిఖీలు నిర్వహించడం లేదు. ఫిర్యాదు చేస్తే తనిఖీలపై రాజకీయ నాయకుల నుంచి ఫోన్లు వస్తున్నాయని చెబుతున్నారు. జిల్లాలో పలు పాఠశాలలకు కూడా గుర్తింపు లేదు. అధిక ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం విక్రయాలపై పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి.

– నరహరి, రాష్ట్ర అధ్యక్షుడు, ది పేరెంట్స్ అసోసియేషన్

జీఓ నంబర్ 1ని అనుసరించాలి



కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు జీఓ నంబర్ 1ని అనుసరించాలి. ఫీజుల పట్టిక నోటీసు బోర్డులో ప్రదర్శించాలి. పుస్తకాలు, యూనిఫాంలు విక్రయించకూడదు. నిబంధనలు పాటించని పాఠశాలలకు నోటీసులు జారీ చేయాలని డిప్యూటీ డీఈఓ, ఎంఈఓలను ఆదేశించాం. వారు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. నిబంధనలు పాటించని పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం.

– బాలాజీరావు, డీఈఓ

కాలకేయుల పాలన

ప్రతిపక్షాన్ని, ప్రతిపక్ష నేతను భూస్థాపితం చేస్తామంటూ సీఎం చంద్రబాబు మాట్లాడుతున్నాడు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో ఆయన సుపుత్రుడు ప్రభుత్వ వ్యవస్థలను అడ్డం పెట్టుకుని ప్రజాప్రతినిధుల నుంచి సామాన్యుల వరకు అక్రమ అరెస్ట్‌లతో భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు. ఆ విధంగానే వైఎస్సార్‌సీపీ నేతలు, సానుభూతిపరులే లక్ష్యంగా పోలీస్, రెవెన్యూ అధికారులతో కలిసి వారి ఆర్థిక మూలలపై దెబ్బ కొట్టే చర్యలకు దిగుతున్నారు. అధికార యంత్రాంగాలు సైతం వాస్తవాలతో పనిలేకుండా.. టీడీపీ ఎమ్మెల్యేలు ఏం చెబితే.. అదే చేస్తూ న్యాయ వివాదాలు సృష్టిస్తున్నారు. నిబంధనల మేరకు వైఎస్సార్‌సీపీ నేతలు ఏర్పాటు చేసిన లేఅవుట్లను ధ్వంసం చేసి నష్టపరుస్తున్నారు.



ఆదాల భూమిలో దుక్కి చేస్తున్న అహోబిలం మఠం ప్రతినిధి

రెడ్‌బుక్ అమలు

- అంబేడ్కర్ రాజ్యాంగం అవహేళన
- వైఎస్సార్‌సీపీ నేతల ఆస్తులే టార్గెట్
- టీడీపీ ఎమ్మెల్యేల ఆదేశాలే చట్టాలు
- 2007లో కనుపర్తిపాడులో 40 ఎకరాలు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఆదాల
- అందులో కొంత మఠం భూమి ఉందంటూ అధికారుల ప్రకటన
- కొత్తూరు–అంబాపురంలో వైఎస్సార్‌సీపీ వర్గీయుల లేఅవుట్లు ధ్వంసం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ప్రజాసంక్షేమాన్ని తుంగలో తొక్కేశారు. అభివృద్ధిని విస్మరించారు. మద్యం ఏరులై పారిస్తూ శాంతి భద్రతలను గాలికి వదిలేశారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అంటూ సామాన్యుడి నుంచి మేధావుల వరకు నోరు మెదపకుండా అక్రమ కేసులతో వేధిస్తున్నారు. పథకాల గురించి ప్రశ్నించే వారిపై కుట్రలు చేస్తున్నారు. అధికారం చేజిక్కించుకుని ఏడాది దాటినా నారా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్నారు. అధికార యంత్రాంగాలు సైతం జీ హుజూరంటూ ఊడిగం చేస్తున్నాయి. కక్షలు, కుట్రలతో కూటమి ప్రభుత్వ పాలన సాగుతోంది. వైఎస్సార్‌సీపీ నేతల ఆర్థిక మూలాలను దెబ్బతీయడమే లక్ష్యంగా స్థానిక టీడీపీ ఎమ్మెల్యేలు వ్యవహరిస్తున్నారు. వారి మౌఖిక ఆదేశాలే చట్టాలుగా భావించి పోలీస్, రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు అమలు చేస్తున్నారు.

రికార్డులు పరిశీలించకుండానే..

నెల్లూరు మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి నగరానికి సమీపంలోని కనుపర్తిపాడులో 2007లో స్థానిక రైతుల వద్ద దాదాపు 40 ఎకరాల భూమి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆ భూముల్లోనే సర్వే నంబర్ 295లో 1.80 ఎకరాల భూమి కూడా రిజిస్ట్రర్ అయింది. అప్పటి నుంచి కూడా ఆదాల అధీనంలో ఆ భూమి ఉంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం వన్ బీ అడంగళ్, పట్టాదారు పాసుపుస్తకం అన్నీ ఉన్నాయి.



మఠం భూమి అంటూ బోర్డు పెట్టిన ప్రైవేట్ వ్యక్తులు

రాజకీయ కక్షతోనే..

కనుపర్తిపాడులో ఉన్న ఆదాల ప్రభాకర్‌రెడ్డికి చెందిన ఆ భూమిని అహోబిలం మఠానికి చెందినది అంటూ స్థానిక వీఆర్వో, మఠానికి చెందిన వ్యక్తి గురువారం ఆ భూమిలో బోర్డు పెట్టడం వివాదాస్పదంగా మారింది. ఇదంతా రాజకీయ కక్షతోనే జరిగిందని వైఎస్సార్‌సీపీ నేతలు మండి పడుతున్నారు. నిబంధనల ప్రకారం ఆ భూమిపై వివాదం ఉంటే స్థానిక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తారు. సదరు రెవెన్యూ అధికారి నోటీసులు ఇచ్చి ఇరుపక్షాలను పిలిపించి వారి వద్ద ఉన్న రికార్డులను పరిశీలిస్తారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం అది పట్టా భూమిగా ఉంటే అందులో ఎవరూ ఏమీ చేయలేరు. ఒక వేళ ప్రభుత్వ భూమి అయి ఉంటే ఆ భూమి ఎలా వచ్చిందో నోటీసు జారీ చేస్తారు. సరైన ఆధారాలు చూపించకుంటే ఆ భూమిని స్వాధీనం చేసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంది. అయితే ఇందుకు విరుద్ధంగా ఏకపక్షంగా ఆ భూమిలో బోర్డు పెట్టిడడం చూస్తే ఇదంతా రాజకీయ కోణంతోనే జరిగిందని, అధికారులు నిబంధనలు ప్రకారం నడుచుకోలేదని వైఎస్సార్‌సీపీ వర్గీయులు మండి పడుతున్నారు. ప్రస్తుతం కనుపర్తిపాడులోని ఆదాల ప్రభాకర్‌రెడ్డికి చెందిన ఆ భూములు మార్కెట్ విలువ ప్రకారం ఎకరా రూ.70 లక్షల వరకు ధర పలుకుతోంది. కనుపర్తిపాడు గ్రామ శివారులో ఉన్న ఆ భూములు విలువ టీడీపీ అనుకూల పత్రికల్లో పాటు సోషల్ మీడియా గ్రూపుల్లో ఎకరం రూ.15 కోట్లు ఉందంటూ, మాజీ ఎంపీ ఆదాల భూమి కాజేశాడంటూ నిరాధారమైన ఆరోపణలతో కథనాలు ప్రచురించడం, వైరల్ చేస్తుండడం గమనార్హం.

కొత్తూరులో లేఅవుట్ ధ్వంసం

నెల్లూరు రూరల్ పరిధిలోని కొత్తూరు–అంబాపురంలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు దాదాపు 27 ఎకరాల్లో లేఅవుట్ వేశారు. అందులో 17 ఎకరాల్లో వేసిన లేఅవుట్‌కు ప్రస్తుత ప్రభుత్వంలోనే మున్సిపల్ కార్పొరేషన్ అప్రూవల్ కూడా తీసుకున్నారు. మిగిలిన 9 ఎకరాలకు అప్రూవల్ లేకపోవడంతో ఆ భూముల్లో ప్లాట్లు వేయకుండానే వదిలేశారు. అందులో రెండున్నర ఎకరాల భూమి రెవెన్యూ రికార్డుల్లో మాత్రం గయాళ్‌గా చూపిస్తోంది. ఆ భూముల చుట్టూ ప్రహరీ నిర్మించారే కానీ ప్లాట్లు వేయలేదు. ప్రస్తుతం ఆ భూములు రైతుల అధీనంలోనే ఉన్నాయి. రాజకీయ కక్షతో పట్టాభూమిలో నిర్మించి ఉన్న ప్రహరీని కార్పొరేషన్ అధికారులు కొంత భాగం ధ్వంసం చేయడంపై సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ఇదంతా వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేసేందుకు ఈ పరిణామాలు చేస్తున్నారని మండి పడుతున్నారు. నెల్లూరు రూరల్ పరిధిలో దాదాపు 50 వరకు అనధికార లే అవుట్లు ఉన్నట్లు ఇటీవల అధికారులు గుర్తించారు. వాటి జోలికి వెళ్లకుండా కేవలం వైఎస్సార్‌సీపీ నేతలనే టార్గెట్ చేయడంపై ప్రజాగ్రహం పెల్లుబుకుతోంది.

7 వేల ప్రదేశాల్లో యోగా

- కలెక్టర్ ఆనంద్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నెల్లూరు (అర్బన్): 11వ జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా వ్యాప్తంగా 7 వేల ప్రదేశాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరుతూ కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ హాల్ నుంచి శుక్రవారం తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఆర్డీఓలు, కమిషనర్లు, ఇతర అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో యోగా కార్యక్రమాల్లో 10 లక్షల మంది పాల్గొనాలన్నారు. యోగా జరిగే ప్రతి ప్రదేశంలో ఒక యోగా ట్రైనర్‌తోపాటు ఒక ప్రత్యేకాధికారి ఉండేలా చూడాలని ఆదేశించారు. మండల స్థాయిలో ఎప్పటికప్పుడు జరుగుతున్న యోగా ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయించాలన్నారు. అన్ని చోట్ల ఏఎన్‌ఎంలు ఉండేలా డీఎంహెచ్‌ఓ ఏర్పాట్లు చేయాలన్నారు. విశాఖపట్నంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పాల్గొనే యోగా కార్యక్రమాలతో సమాంతరంగా జిల్లాలో యోగా కార్యక్రమాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్‌తోపాటు జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, డీఈఓ బాలాజీరావు, జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి యతిరాజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయకపోతే చర్యలు

- రూ.13 కోట్ల విలువైన పనులకు వర్క్ ఆర్డర్లు
- ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ విజయన్ హెచ్చరిక



మాట్లాడుతున్న ఎస్‌ఈ విజయన్

నెల్లూరు (వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్లలో పెండింగ్‌లో ఉన్న వర్క్ ఆర్డర్లను ఈ నెలాఖరు లోపు పూర్తి చేయకపోతే సంబంధిత విద్యుత్ అధికారుల జీతాల నుంచి రికవరీ చేస్తామని ఎస్ఈ విజయన్ హెచ్చరించారు. నగరంలోని విద్యుత్‌భవన్‌లో శుక్రవారం జిల్లాలోని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2022–23 ఏడాదికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న వర్క్ ఆర్డర్లపై దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా జిల్లాలో ఐదు డివిజన్లలో అధికంగా వర్క్ ఆర్డర్స్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆత్మకూరులో 398, కావలి 89, కోవూరు 134, నెల్లూరుటౌన్ 14, నెల్లూరురూరల్ 147 మొత్తం రూ.13 కోట్ల విలువైన 782 వర్క్ ఆర్డర్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా వీటిని పరిష్కరించే విధంగా ఈఈలు దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, నోడల్ అధికారి శేషాద్రిబాలచంద్ర, అకౌంట్స్ ఆఫీసర్ విజిత, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆశవర్కర్ల సమ్మె నోటీసు



సమ్మె నోటీసు ఇస్తున్న ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు

నెల్లూరు (అర్బన్): ఆశ వర్కర్లకు రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వడంతోపాటు వారిని కార్మికులుగా గుర్తించాలని ఏపీ ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం సంతపేటలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ సుజాతకు ఆశ కార్యకర్తలు జూలై 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో భాగమవుతున్నామని, సమ్మె నోటీసు అందజేశారు. దుగ్గిరాల అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు టీబీ, లెప్రసీ, సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, ఫైలేరియా వంటి సర్వేలు చేస్తున్నారన్నారు. బాలింతలు, గర్భిణులను గుర్తించి వారికి పౌష్టికాహారం అందేలా కృషి చేస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో అన్ని రకాల వైద్య సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ అదనంగా టీబీ నిర్ధాణ జరిపే గళ్ల పరీక్షలు చేయాలనడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, కోశాధికారి మధుమాధవి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(టౌన్): జిల్లాలోని వలేటివారిపాళెం, లింగసముద్రంలోని టైప్ – 4 కేజీబీవీల్లో 2025 – 26 విద్యా సంవత్సరంలో తాత్కాలిక గెస్ట్ ఫ్యాకల్టీ (వార్డెన్, పార్ట్‌టైం టీచర్లు), డైలీ వేజ్ పద్ధతిలో నాన్ టీచింగ్ సిబ్బంది (హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, వాచ్‌మెన్లు)కి సంబంధించి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వలేటివారిపాళెం ఆదర్శ పాఠశాలలో వార్డెన్ – 1, పార్ట్‌టైం టీచర్ – 1, హెడ్ కుక్ – 1, అసిస్టెంట్ కుక్ – 2, వాచ్‌మెన్ – 1, లింగసముద్రంలో వార్డెన్ – 1, పార్ట్‌టైం టీచర్ – 1, హెడ్ కుక్ – 1, అసిస్టెంట్ కుక్ – 2, వాచ్‌మెన్ – 1, ఉలవపాడు (వీరేపల్లి)లో వార్డెన్ – 1, పార్ట్‌టైం టీచర్ – 1, హెడ్ కుక్–1, అసిస్టెంట్ కుక్ – 2, వాచ్‌మెన్ – 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- కుమార్తె పెళ్లికి నగదు తెచ్చిన బాధితుడు
- బూడిదైన రూ.2.50 లక్షల నగదు



కాలిపోయిన వస్తువులు

కొండాపురం: మండలంలోని ఆదిమూర్తిపురం గ్రామంలో గురువారం రాత్రి రేకుల ఇల్లు దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన తుల్లిబిల్లి కొండయ్య రేకుల ఇంట్లో నివాసం ఉంటున్నాడు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి మంటల్ని ఆర్పేలోపు కొండయ్య కుమార్తె వివాహానికి సమకూర్చుకున్న రూ.2.50 లక్షల నగదు, 4 సవర్ల బంగారం, గృహోపకరణాలు, వివిధ పత్రాలు, రేషన్, ఆధార్ కార్డులు దగ్ధమైనట్లు బాధితుడు తెలిపాడు. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న తహసీల్దార్ కోటేశ్వరరావు, వీఆర్వో కొండయ్యలు శుక్రవారం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు.

కాకాణి బెయిల్ పిటిషన్ తిరస్కరణ

నెల్లూరు(లీగల్): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిపై పొదలకూరు పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులకు సంబంధించి నెల్లూరు ఐదో అదనపు జిల్లా (ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ) కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలైంది. రాజకీయ కక్షతో కేసులు పెట్టారని, బెయిల్ ఇవ్వాలని కోరారు. ఈ కేసు విచారణ పలుసార్లు వాయిదా పడుతూ వచ్చింది. గోవర్ధన్‌రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ శుక్రవారం న్యాయమూర్తి సరస్వతి ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్ఎస్‌సీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(అర్బన్): స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, భారత ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు నివేదించిన వివిధ పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 23వ తేదీతో ముగుస్తుందని కలెక్టర్ ఆనంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుల భర్తీ కోసం కమిషన్ ఓపెన్ కాంపిటేటివ్ కంప్యూటర్ ఆధారిత పరీక్షను నిర్వహిస్తారన్నారు. దరఖాస్తులను కమిషన్ అధికారిక వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్://ఎస్ఎస్‌సీ.జీఓవీ.ఇన్ ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. ఫీజును ఈనెల 24లోగా ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దైవ దర్శనానికి వెళ్లగా..

- పది సవర్ల బంగారం, నగదు చోరీ



దొంగలు పగులగొట్టిన బీరువా

అల్లూరు: ఓ కుటుంబం తిరుమలలో దైవ దర్శనానికి వెళ్లగా దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి బంగారం, నగదు దోచుకెళ్లిన ఘటన అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని అంజినాయుడు కాలనీలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కె.మహేష్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. అతను కుటుంబంతో గురువారం ఉదయం తిరుమలకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం మహేష్ ఇంటి తలుపులు పగులగొట్టి ఉండగా స్థానికులు గుర్తించి అతడికి ఫోన్ చేసి చెప్పారు. దీంతో మహేష్ తన బంధువులు, స్నేహితులను ఇంటి దగ్గరికి పంపాడు. పది సవర్ల బంగారం, రూ.70 వేల నగదును దొంగలు చోరీ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎంతో కష్టపడి సంపాదించుకున్న బంగారం, నగదు దోచుకెళ్లారని, పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరాడు.

విషాద యాత్ర

సరదాగా సాగిన యాత్ర ఆ కుటుంబంలో అంతులేని విషాదాన్ని నింపింది. తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు, ఓ బాలిక మృతిచెందడంతో కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన కారు

- ఒకే కుటుంబంలో ఇద్దరి మృతి
- ఐదుగురికి గాయాలు
- బాధితులది తిరుపతి జిల్లా



దెబ్బతిన్న కారు

కొడవలూరు: కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఓ బాలిక, ఓ వృద్ధుడు మృతిచెందారు. ఐదుగురు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని రాచర్లపాడు వద్ద శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా భాకరాపేటకు చెందిన మహబూబ్‌బాషా కుటుంబం పదిమంది కారులో హైదరాబాద్ యాత్రకు వెళ్లింది. తిరిగి అదే కారులోనే సొంతూరికి బయలుదేరారు. కొడవలూరు మండలం రాచర్లపాడు సమీపంలో వస్తుండగా కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న మస్తాన్ సాహెబ్ (67) అక్కడికక్కడే మృతిచెందారు. ఆయేషా (11) అనే బాలిక తీవ్రంగా గాయపడి ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయింది. కారు నడుపుతున్న మహబూబ్‌బాషాతోపాటు లోపల ఉన్న మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను హైవే మొబైల్ సిబ్బంది చొరవతో 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నెల్లూరు వైద్యశాలకు తరలించారు. గాయపడిన వారికి ప్రాణాపాయ పరిస్థితి లేదని వైద్యులు తెలిపినట్లు ఎస్సై కోటిరెడ్డి వెల్లడించారు. కారు నడుపుతున్న వ్యక్తి నిద్ర మత్తు కారణంగా అదుపుతప్పి ఉంటుందని ప్రాథమికంగా భావిస్తున్నామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



ఆయేషా మృతదేహం



మస్తాన్ సాహెబ్ మృతదేహం

కళ్లెదుటే తండ్రి, మేనకోడలి మృతి

భాకరాపేటకు చెందిన మహబూబ్‌బాషా సొంత కారులో కుటుంబ సభ్యులను రెండు రోజుల క్రితం హైదరాబాద్ యాత్రకు తీసుకెళ్లాడు. అక్కడ వివిధ ప్రాంతాలను సందర్శించి సంతోషంగా తిరిగొస్తుండగా రాచర్లపాడు వద్ద ప్రమాదం జరిగింది. బాషా తండ్రి మస్తాన్ సాహెబ్, అక్క కూతురైన ఆయేషాలు మృతిచెందారు. కళ్లెదుటే తండ్రి, మేనకోడలు చనిపోవడం, మిగిలిన కుటుంబ సభ్యులు గాయపడటంతో బాషా కన్నీరుమున్నీరయ్యారు. క్షతగాత్రులు మృతులను చూసి రోదించడం స్థానికులను కలచి వేసింది.

ప్రజలకు వేగంగా సేవలు : కలెక్టర్

- ఘనంగా రెవెన్యూ దినోత్సవం

నెల్లూరు(అర్బన్): 'రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది దశాబ్దాల తరబడి ప్రజలతో నేరుగా సత్సంబంధాలు కలిగి ఉన్నారు. నేడు వచ్చిన ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకుని వారికి మరింత వేగంగా సేవలందించాలి' అని కలెక్టర్ ఆనంద్ కోరారు. శుక్రవారం జిల్లా, డివిజన్, మండల స్థాయిలో రెవెన్యూ దినోత్సవం ఘనంగా జరిగింది. నెల్లూరు కలెక్టరేట్‌లో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి అధ్యక్షతన వేడుకల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ అసోసియేషన్‌కు గెస్ట్‌హౌస్ నిర్మించేందుకు చర్యలు చేపట్టామన్నారు. అలాగే వచ్చేనెల 11వ తేదీ నుంచి మూడు రోజులపాటు ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జేసీ కార్తీక్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో ఆ శాఖ ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా రెవెన్యూ అకాడమీ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. అనంతరం పెంచలరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగిగా ప్రజలకు సేవచేసే అరుదైన అవకాశం ఉద్యోగులకు దక్కిందన్నారు. అనంతరం రిటైరైన పలువురు తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్ తదితర ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. అలాగే పాత్రికేయుడు వేలమూరి శ్రీధర్‌ను సత్కరించారు. తర్వాత ప్రజల్లో రెవెన్యూ శాఖ ఔన్నత్యాన్ని కాపాడుతామంటూ, జవాబుదారీగా పని చేస్తామని కలెక్టర్‌తోపాటు అధికారులు, ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్వో ఉదయభాస్కర్ రావు, టీజీపీ స్పెషల్ కలెక్టర్ హుస్సేన్ సాహెబ్, కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయకుమార్, ఏపీఆర్ఎస్ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి డానియేల్ పీటర్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



హాజరైన రెవెన్యూ ఉద్యోగులు



కలెక్టర్‌ను సన్మానిస్తున్న పెంచలరెడ్డి

హత్య కేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): ఉత్తరప్రదేశ్ వాసి హత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం నెల్లూరులోని నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్ రెడ్డి కేసు పూర్వాపరాలను వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సంత్ కబీర్‌నగర్ జిల్లాకు చెందిన జైహింద్ సహానీ (40) ఉడ్ పాలిషింగ్ వర్కర్. అతను ఉపాధి నిమిత్తం కొంతకాలం క్రితం నెల్లూరుకు వచ్చాడు. అదే రాష్ట్రం సిద్ధార్థ నగర్ జిల్లాకు చెందిన పరదేశి, రామ్‌కేష్‌తో కలిసి శ్రీనివాస నగర్ ఒకటో వీధిలో నివాసం ఉంటూ నగరానికి చెందిన శివ మేస్త్రీ వద్ద పనిచేస్తున్నారు. జైహింద్ తమను మందలించడం, పెత్తనం చెలాయించడాన్ని పరదేశి, రామ్‌కేష్‌లు జీర్ణించుకోలేకపోయారు. ఈనెల 16వ తేదీ రాత్రి సుమారు 11 గంటల ప్రాంతంలో జైహింద్ భోజనం చేస్తుండగా వారు బండరాయితో అతని తలపై కొట్టి హత్య చేశారు. అనంతరం నిందితులు పరారయ్యారు. మృతుడి బంధువు సోను సహానీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. వారిని బర్మాషెల్‌గుంట వద్ద గురువారం అరెస్ట్ చేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సమావేశంలో ఎస్సై రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

బార్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం



కోర్టు ఆవరణలో న్యాయవాదుల ప్రచారం

నెల్లూరు(లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికల పోలింగ్ శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. వీసీఎస్ఆర్ న్యాయవాదుల ప్యానెల్, న్యాయవాదుల ఐక్య వేదిక ప్యానెల్, జాతీయ న్యాయవాద ప్యానెల్‌కు చెందిన అభ్యర్థులు, మద్దతుదారులతో జిల్లా కోర్టు ఆవరణ కిక్కిరిసింది. ఘర్షణలకు తావు లేకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం పది గంటలకు మొదలైన పోలింగ్ రాత్రి 7:30 గంటలకు ముగిసింది. సెల్‌ఫోన్లను అనుమతించలేదు. పోలీసులు తనిఖీ చేసిన అనంతరం పోలింగ్ కేంద్రంలోకి న్యాయవాదులను పంపారు. 1,362 ఓట్లకు గానూ 1,149 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. లెక్కింపు రాత్రి 10 నుంచి మొదలైందని ఎన్నికల అధికారి బి.శ్రీనివాసన్ తెలిపారు.



ఓటు వేసేందుకు క్యూలో ఉన్న న్యాయవాదులు

గురుకులాల్లో మిగిలిన సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025 – 26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఖాళీ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ జరుగుతుందని డీసీఓ డాక్టర్ సి.ప్రభావతమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతికి సంబంధించి ఈనెల 22వ తేదీ బుచ్చిరెడ్డిపాళెంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో మెరిట్ లిస్ట్ ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహిస్తారన్నారు. జూనియర్ ఇంటర్‌లో మిగిలిన సీట్లకు 26వ తేదీ కొత్తకోడూరులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో మెరిట్ లిస్ట్ ఆధారంగా కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. విద్యార్థులు వారి ర్యాంక్ కార్డు, ఆధార్ తదితర సర్టిఫికెట్లను తీసుకురావాలని సూచించారు.

వెంగమాంబ బ్రహ్మోత్సవాల ఆదాయం రూ.51.50 లక్షలు

దుత్తలూరు: వెంగమాంబ బ్రహ్మోత్సవాలకు సంబంధించి వివిధ మార్గాల ద్వారా రూ.51,50,638ల ఆదాయం వచ్చినట్లు ఈఓ వెట్టిగుంట ఉషశ్రీ తెలిపారు. శుక్రవారం దేవస్థాన సన్నిధిలో హుండీ కానుకల్ని లెక్కించారు. ఈ సందర్భంగా ఆమె వివరాలు తెలిపారు. హుండీల ద్వారా రూ.25,11,590, తాత్కాలిక అంగళ్ల వేలంపాట ద్వారా రూ.6.50 లక్షలు, అన్నదానం విరాళాల ద్వారా రూ.6,41,344, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.4,74,600, దర్శనం టికెట్ల అమ్మకం ద్వారా రూ.7,03,660, తలనీలాల టికెట్ల అమ్మకం ద్వారా రూ.49,920, అమ్మవారి కల్యాణ చదివింపుల ద్వారా రూ.22,764, ఉభయాల ద్వారా రూ.79,380, ఇతరాల ద్వారా రూ.17,380 చొప్పున వచ్చినట్లు తెలిపారు. గత ఏడాది కంటే భక్తుల సంఖ్య తగ్గడంతో ఆదాయం కూడా తగ్గినట్లు తెలుస్తోంది. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.నాగమల్లేశ్వరరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



కానుకల లెక్కింపు

కండలేరులో 35.723 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 35.723 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2,380, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 50, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

'యోగాంధ్ర'ను విజయవంతం చేద్దాం

- జేసీ కార్తీక్
- ఏసీ స్టేడియంలో ఏర్పాట్ల పరిశీలన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శనివారం జరిగే జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ కోరారు. శుక్రవారం స్టేడియంలో ఏర్పాట్లను జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికి కేటాయించిన విధులను వారు సక్రమంగా, బాధ్యతతో నిర్వహించాలన్నారు. యోగా ఔత్సాహికులు ఉదయం 6 గంటలకు స్టేడియానికి చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు, మహిళలు భారీ సంఖ్యలో హాజరవుతున్న దృష్ట్యా ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమ అనంతరం విద్యార్థులు క్షేమంగా తిరిగి వెళ్లేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నందన్, ఆర్డీఓ అనూష, డీఎస్‌డీఓ యతిరాజ్, డీఎంహెచ్‌ఓ సుజాత, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్, డీఈఓ బాలాజీరావు, ఆర్ఐఓ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ, అధికారులు

రేపు పీజీ జోనల్ సీఎంఈ ప్రోగ్రాం

నెల్లూరు(అర్బన్): ఈనెల 22వ తేదీన దర్గామిట్టలోని ఏసీఎస్ఆర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కంటిన్యూస్ మెడికల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా పీజీ జోనల్ సీఎంఈ ప్రోగ్రాం నిర్వహిస్తామని ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరి, సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం సర్వజన ఆస్పత్రిలోని సూపరింటెండెంట్ చాంబర్‌లో డాక్టర్లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంకో అనస్తీషియా, రీసెంట్ అడ్వాన్సెస్‌పై కొత్త పద్ధతులు, మెళకువలు, కొత్త పరిశోధనల గురించి చర్చించడం జరుగుతుందన్నారు. జోన్‌లో ఉన్నటువంటి అన్ని మెడికల్ కళాశాలల పీజీ విద్యార్థులు హాజరవుతారన్నారు. ఓవైపు ఆపరేషన్ థియేటర్‌లో చికిత్సలు అందిస్తూ మరో వైపు స్క్రీన్‌పై లైవ్‌లో కనిపించేలా పీజీ వైద్యులకు బోధన జరుగుతుందన్నారు. పీజీ చేస్తున్న వైద్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి, అనస్తీషియా విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన ప్రిన్సిపల్ తదితరులు

టెర్రస్ పైనుంచి పడి..

- చికిత్స పొందుతూ బాలిక మృతి
- అనుమానం వ్యక్తం చేసిన బాధిత కుటుంబం

కోవూరు: మండలంలోని లేగుంటపాడు గ్రామానికి చెందిన ఓ బాలిక టెర్రస్ పైనుంచి కిందపడింది. తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ చనిపోయింది. స్థానికుల కథనం మేరకు.. రేష్మ కుమార్తె రషీఫా (5) సోమవారం తమ ఇంటి టెర్రస్ పైనుంచి కింద పడింది. ఆ సమయంలో రేష్మ ఇంట్లో ఉంది. ఆమె బయటకు వచ్చి చూసింది. బాలికకు తీవ్రగాయాలు కావడంతో ఆ కుటుంబం వెంటనే మోటార్‌బైక్‌పై నెల్లూరులోని నారాయణ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్య పరీక్షల అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి స్విమ్స్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు చెన్నైకి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రషీఫా చనిపోయింది. కాగా ఈ ఘటనపై తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. టెర్రస్ పైకి ఎవరైనా తీసుకెళ్లి తోసారా?, లేక ప్రమాదవశాత్తు జారిపడిందా? అనే కోణాల్లో విచారణ చేయాలని కోరుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఆస్పత్రిలో రషీఫా

నిమ్మ ధరలు (కిలో)

- పెద్దవి : రూ.30
- సన్నవి : రూ.20
- పండ్లు : రూ.10

